# పాత కలాలు : కొత్త పేజీలు

# నా మీదే నర్రోయ్

భమిడిపాటి కామేశ్వరరావు

అనగనగా ఓ ఊరు (అంత మాత్రాన్ని ఇది పిట్టకథా కాదు, బాతుకథాకాదు !) ఆ ఊళ్ళో ఓ ఇల్లుంది, మరెక్కడా ఉండడానికి పీల్లేక ! లోగడ చాలా ఊళ్ళకి పేరుపోయినట్టే ఆ ఊరికి గూడా పోవడం చేతనున్నూ రాబోయే జనాభా లెఖ్ఖల సందర్భాలలాంటి వాట్లవల్ల ఇంటినెంబర్లు మారుగుడు కావటంచేతనున్నూ, బోలెడు పాత రికార్డు దులిపితే గాని ఆ ఊరియొక్క వెనుకటి పేరు తేలదు; బోలెడు ఇతర బడిసుట్లు పడితే గాని ఆ ఇల్లున్న జాగాయొక్క వయినం తేలదు. అందుకని తబిసీళ్ళు గురించి నన్నుఅట్టే రాకాయించక ఎందుకన్నానో అన్నాను. ఇల్లా పోనీండి ఈతభాకి. ఆ యింటి యజమాని ఒకాయనే అని కొందరు, ఇంట్లో ఉండేజనం యావద్విశిష్టం యజమాన్లే అని మరికొందరూ పట్టింపులు పోయేవారు. పోనీ మనం ఏదో కాడికి రాజీకి దిగి ఒకాయనే అని ఒప్పుకుందాం. ఆయనకే నా ఏదో సంజ్ఞ ఉంటే తప్ప వ్యవహరించడం కష్టం గనక, ఆయన్ని "సుభర్త" అందాం. ఇంటావిడ గార్ని అప్పుడు "సుభార్య" అనిన్నీ, వారి కుమారుణ్ణి "సుపుత్రుడు" అనిన్నీ పిలవచ్చు. ఇంటి వారంతా కూడా అఖండ జ్ఞానులైనప్పుడు, పేర్లు మంచివిగా ఉండడంలో చెడుగు ఏమీ లేదు. సుభర్తగారి తల్లి వుంది. ఆవిణ్ణి – వ్యాకరణ సిఖా కోసిరిగాని – "సుబామ్మ" అంటే తప్ప సుపుత్రుడు కొంప పీకేస్తాడు.

ఒకనాడు, (ఎప్పుడూ అంటే వెనక. అంతకంటే అడగద్దు. మనవి చేశాగా !) పొద్దుట పేళ ఆయింటికి వున్న ఒకానొక సావిడి లాంటి మెల్లాలోకి ఒక ముసీలి స్వాములవారువెళ్ళి, కుర్చీమీద కూర్చుని, మోచేతులు కుర్చీ చేతులికి ఎక్కించి, అరిచేతుల్లో గడ్డం ఆనుకుని, కళ్ళు మూసుగుని ధ్యానం దాటిపోయి సమాధిలో పడిపోయాడు. సుభర్త యింట్లో లేడు. అది అతడు కాఫీకి వెళ్ళే టైము.

అతడు సకృత్తుగా ఇంట్లో కాఫీ పుచ్చు గున్నా, విధిగా బయట కతికి తీరతాడు. అతని మహిమవల్ల అతనికి ప్రతీ కాఫీ హోటలోనూ కాతాయే. ఏదేనా పాత కాఫీ హోటల్లో తను ఇవ్వదేలిన బాకీ మొత్తం బాగా ముదరబారినప్పుడు,ఆయన ఆ శ్రేణికి వెళ్ళటం మానెయ్యవలసిన అవసరం వస్తూండబట్టి, ప్రతీ కొత్త కాఫీ హోటల్లోనూ వారిదే శ్రీ॥ సుపుత్రుడు ఇల్లటపల్లుడు. అతని అత్తారి కుటుంబంలో ఎవరికో మందిప్పించుగోడానికి వారంతా స్వగ్రామంనించి పట్నం వెల్తు అతణ్ని విడిచిపెట్టలేక కూడగట్టుకెళ్ళటంవల్ల అతడు ప్రస్తుతం పట్నంలో ఉన్నాడు. సుబామ్మగారు తన కొడుకుతో గాని, కోడలితో గాని కాల యాపనకోసం మాటా తిట్టూ ఆడుకుంటూ మహధ్వజాయంగా ఉపన్యాసం ఉరిమేటప్పుడుగాని కనిపించదు. మొత్తంమీద అప్పుడు ఇంట్లోను భార్య ఒకర్తే ఉంటా. కొంతసేపటికి ఆవిడ మెల్లాలోకి వచ్చి ఒక గ్లాసూ,పప్పుగిన్నీ, చమ్చా వగైరాలు చప్పుడు కాకుండా స్వామిలారి దగ్గిరపెట్టి లోపలికి వెళ్ళింది. స్వాములారు చుట్టుపక్కల అయ్యే అలికిడి కూడా చెవినిపట్టని యోగంలో ఉంటూన్నప్పటికీ,తనదివ్య జ్ఞానమహిమ వల్ల, కాఫీ పరికరాలు తన సాన్నిధ్యానికి అఘగుడెంచడం పోల్చాడు. తత్క్షణమే కళ్ళువిప్పి, వేళ్ళ సంధులు బెట్టించి, ఆవిలించి చిటిగేసి గొంతుక బాగుపడే నిమిత్తం దీర్ఘంగా సకిలించి, గుటకేసి "నారాయణ" అనుకొని- ఆయన గ్లాసులో ఉన్న పాలుపోసి ఆ పప్పు గిన్నెలో ఆ యొక్క క్షీరకషాయ సమ్మేళన మహోత్సవ వైభవం చేతులారా జరుపుతూ కళ్ళారా చూస్తూ ఉన్నాడు. నవ సవోదయందాలుస్తూ, సకల కశ్మల హరమై ఒప్పేటటువంటి ఏతత్కాఫీ ద్రావక గంధం వారినాసికాగ్రాన్ని దీకుక్కనేసరికి వారికి నోరూరి,నాలిక జలడి,వాగ్ధార ప్రవహించేటంత పనీ జరిగింది.కాని సుభార్యగారు క్షణానికోమాటు ఉహూ ఎగపీలుస్తూండడం, నిరంతరం ఉహూ చీత్తూండడం కూడా స్వాములారికి ఇంట్లోంచి వినిపిస్తున్నాయేమో, ఇంతా ముస్తాబు చేసుకుని తయారైన వారియొక్క లెక్పరుదేవి వేషం తీసేసి వెనక్కి వెనక్కి అణగారడం మొదలెట్టింది. అయినా సరే, ఆవిడ దుఃఖానికి కారణం ఏమిటో గమనించితీరాలనే బుద్ధి ఆయన్ని వదలకుండా పట్టుకోడంవల్ల. ఆయన తనకి కావలసిన పంచదార పక్కనే ఉన్నట్టు చూసీ కూడా, అడిగీ అడగనట్టు—

"అమ్మా! కాస పంచదార!" అని

"ఓహో! ఇక్కడ పెట్టేశారా! మరి తేనక్కరలేదు, తల్లీ!" అన్నాడు. (మహా అక్కడికి, తను కేకేసిన దరిమిలానే అది తన కంటపడ్డట్టు!) ఇలాంటి అర్ధకుసిపరామర్శ తనకి నచ్చక గావును, సుభార్య తన మూగనోములోనే ఉండిపోయింది. దాంతోటి స్వాములవారు తప్పకుండాఏదో కమామిషు వుందనుకొని, ఒక చిన్న "తనలో" (అనగా స్వగతం) ప్రారంభించారు : "క్షీరం బ్రహ్మ, చక్కెర ప్రకృతి కషాయం జీవుడు. కాఫీ ద్రావకం స్వయంగా సృజన గావించుకొనే భక్తకోటికి ఆ యొక్క ప్రకృతి జీవ

బ్రహ్మైక్య విషయ బోధ ప్రత్యక్షంగా సిద్ధిస్తుంది గదా. తిన్నగా చూస్తే అంతా తత్వమే. అదే నీవు" అని.

ఈ వాక్యాలతోటి, సుభార్య సావిడి తలుపుదగ్గిర కొచ్చి, "నాయనా, ఒక్క రవ్వ వడ్డించమన్నా రాండి?" అని కనుక్కుంది.

స్వా – ఉన్నదమ్మా. మరి అవసరం లేదు. అయితే అమ్మా, తమరు తత్వం వింటూంటారుగదా, దుఃఖంలో ఉన్నారే! సుఖానికి గర్వించరాదనీ, దుఃఖానికి ఏడవ కూడదనీ, నిన్నటి ప్రసంగంలోనేగా అయ్యగారూ నేనూ ముచ్చటించాం! ద్వంద్వాలయెడ సమభావం ఉండద్దూ. తల్లీ!

సుభా – నిజమేనండి. నేనూ విన్నా. కాని, స్వంత వ్యాపారం వచ్చినప్పుడు తత్వం హుష్‌కాకీ అవుతుంది

స్వా – అయ్యగారు వీధులోకెళ్ళి ఎంతసేపైంది.

సుభా – ఇప్పుడిప్పుడే. ఆయన వెళ్ళిన అరగంటకి మీరొచ్చారు. మొహం కడుక్కుంటూనే వారు నన్ను కాఫీ కాచ మన్నారు. నాకు చెయ్యి ఊరుకోక, చేతిలోపని చేసేసుకుని కాస్తానండీ అన్నాను. అంటే, ఆయన పోన్లే వద్దు, కాఫీహోటేలికి వెళ్ళి పుచ్చుగుంటాలే, స్వాములారు వస్తేమాత్రం కాచు' అని నాతో చెప్పేసేసి, చక్కాపోయారు. ఇక రావాలి.

స్వా – వారేమన్నా ఆగ్రహందాల్చి వెళ్ళడంవల్లగానీ తమరు చింతిల్లడంలేదు కదా ?

సుభా – కాదండి. మావాడు పట్టం నించి ఉత్తరం రాల్చాడు. వారు బయటికి వెళ్ళగానే వచ్చింది.

స్వా – ఏం? అంతా క్షేమమేకదా ?

సుభా – మీ దయవల్ల.

స్వా – ధననష్టం ఏమన్నావచ్చిందా?

సుభా – అల్లాంటిదిప్పుడు స్మరించడానికే వీలులేదండి.

స్వా – మరేమిటమ్మా! ఏముందిఉత్తరంలో? అబ్బాయి పరీక్ష పేలిపోయిందా? మీ దావా పరాయి పక్షం అయిందా?

సుభా — అవేవీకాదండి! పొరుగింటా రబ్బాయి చేత ఉత్తరం చదివించాను.

స్వా – చెప్పవమ్మా, తల్లీ!

సుభా – దేశ దేశాలా మాకున్న కీర్తి నాశనం అయిపోయిందిటండీ, బాబుగారూ! మా యింటి వాటాలో అద్దెకి తగులడ్డ చచ్చినాడి వల్లేనండీ నాయనా! (అని బారుమని కుసిళ్ళుతుంది)

స్వా – అన్ని దేశాల్లోనూ ఏకకాల మందే పోయిందా? ఉండు, ఉండవమ్మా, తమాయించు ఏదీ, ఆ ఉత్తరం!

సుభా – (లోపలికెళ్ళి తెచ్చి) ఇదిగో నండి.

స్వా – బాబుగారొచ్చి చదివేస్తే బాగుండును. నాకు ఆనదు. అడుగో! చిరంజీవ! రండి!

అనేసరికి, సుభద్ర, అప్పుడేకొండలు పిండిగొట్టి దండయాత్ర నించి వచ్చే ఠీవితో ఇంటికొచ్చాడు. స్వాములారు ఉత్తరం ఆయన చేతికిచ్చాడు. మెల్లాలో ఉన్న మరో కుర్చీమీద సుభద్ర కూలబడి ఉత్తరం చదువుకున్నాడు. చదువుకుని, కుర్చీలో ఒరిగి కళ్ళు మూసుగుని,

సుభ – స్వామీ! ఓటిచెప్తాను వినండి.

ఇది న్యాయానికి రోజులు కావండి.

స్వా – కావు నాయ్నా! బ డి తి బాజాకి రోజులు!

సుభ – నేను ఓ గొప్ప పొరపాటు చేశాను.

స్వా – (ఏదో తెలియక) చిత్తం అల్లాగే మరీ! పొరపాటా, పొరపాటు న్నరా! ఏమిటండీ?

సుభ – నాయింట్లో వాటా ఓడికి అద్దెకిచ్చాను. ఆరేళ్ళనించి వాడు లుచ్ఛా అని కనిపెట్టలేకపోయాను. మా వా డు దెబ్బతో గ్రహించాడు.

స్వా – ఎవాడా అద్దెవాడు?

సుభ – ఉన్నాడులెండి మీ రెరగరు, విషధరం.

స్వా – ఏం జేశావిప్పుడు?

సుభ – నన్ను, నా వాళ్ళనిన్నీ పత్రికలోనున్నూ ఏకేసినిన్నీ దేశ దేశాలా నున్నూ, నా కీర్తి దాగుచేశాడు.

స్వా – మీ జాతక ప్రభావంబట్టి మీకు దేశ దేశాల కీర్తి ఉండడంలో అబ్బరం లేదు, కాని, ఎప్పుడూ మీరు నాతో చెప్పనేలేదే ఆమాట! ఆ ఉత్తరంలో ఇదేనా మీవాడు రాసింది ? చదవండి.

సుభ – (చదువుతాడు) నాన్నగారికి – అంతా క్షేమం. మనింట్లో ఉన్న విషధరం మంచివాడని భ్రమించకండి. అతడు వయోముఖ వ్యాఘ్రము.

స్వా – ఇక్కడ రెండు పాత సమాస బాగాలకి వివాహం జరిగినట్టుంది. కానీయ్యండి.

సుభ : (చదువును) నాడు తొమ్మిది నెలలక్రిందట మనకి జరిగిన ఘర్షణ యావత్తు ఫలానా పత్రికలో రాసేసి, దేశదేశాల మనకున్న కీర్తి వాడు నాశనం చేశాడు. ఇంకా నయమే. కొన్ని కొన్ని లోగుట్టు సంగతులు ఎక్కించాడు కాడు, మరీ చిక్కగా ఉండేది. ఈ పాటి ఆ వ్యక్తిని ఇంటోంచి గెంటియ్యండి. బెంగ పెట్టుకోకండి. తగిన సమాధానం నేను రాస్తాను"

స్వా–ఆ పత్రిక ఏమిటో, ఆ సంగతి ఏమిటో, మీ పేరెట్టి ఉ ం దో లే దో, ప్రపంచకపు రీతో చూ సు గో వ ద్దూ నాయ్నా.

సుభ – ఇంకా సంశయం ఎ ం దు కయ్యా, మా వా డు రాసిం తరువాతా ! మా వాడి సూక్ష్మబుద్ధి మీ రెరు గ రు. (సుభార్య కేసి తిరిగి) ఒసే, మనకీర్తి నాశనం అయిపోయిందటే : మనుషులున్న ప్రతిమూలకీవెళ్ళి వాడు మన్నీ యాగపెడుతున్నాడుటే(అని వాపోతాడు)

సుభ – భడవాచట్రం అండీ, భడవా చట్రం ! ఆరేళ్ళనించీ కళ్ళు పొరగమ్మి కానలేకపోయాం.

స్వా – ఆ పత్రిక ఒకసారి తెండి నాయనా !

సుభద్ర కుర్చీమీంచి చివాల్నలేచి, వీధులోకి ఒ క్క గ ం తే శా డు. ఆ మట్టున అతడు వీధులో ఈ మూలనుంచి ఆమూలకి ఉప్పట్లాటలోకి మల్లే గాల్ని కవ్వించి, కనపడ్డ ప్రతివాణ్ణి జబ్బట్టుగుని ఆపి (స్త్రీలమీద ఆయన చెయ్యి చేసుకో లేదట, అందువలన ఆయన కొందరి కంటె ధీరుడే!) నిలేసి.

సుభ – విన్నారా ?

ప్రతీవాడు – లేదండి.

సుభ – ఛీ ఇంకా వినకపో వ డ ం

ఏమిటి ! మా యింటోనున్న అదెకున్న లుచ్చా, మా మీద రాసేసి, దేశదేశాల్లో నున్నా మా కీర్తి తుడిచేశాడు.

ప్ర – ఎక్కడండీ, రాస్తా ?

సుభ – ఫలానా పత్రికలో. తెలిసిందా ?

ప్ర : సరేలెండి తెలిసింది. చదువుతాం, జబ్బ వదిలిపెట్టండి.

అన్న తరవాతే వాళ్ళని విడుదల చేస్తూ, ఈ రీతిగా కొంతకాలం స్వవిషయ ప్రాశస్త్యం ప్రతిఫలాపేక్ష లేకుండా ప్రచారం చేసుకుని, అక్కణ్ణించి, ఫలానా పత్రికలుండే రెండు మూడు చోట్లకి ఎగడి ప్రయత్నించిన మీదట అవి ప్రతి చోటా నిండుకోవడం విని, మళ్ళీ హాలో లక్ష్మణా అంటూ అద్దెవాడైన విషధరం దగ్గరికేవచ్చే,

సుభ(చిరునవ్వుతో) అయితేచూడండి! మీరుతొమ్మిదినెల్ల ఏదో రాశార్ట ఆపత్రిక ఓ మాటు ఇల్లా యివ్వండి, వేరే పనుంది.

వి–తమకి ఏ నెలది కావాలి ! తొమ్మిది నెల్లూ ముంతెడు నీళ్ళూ అంటే ఎలా తెలిసేది ?

సుభ–సరే లేవయ్యా, మహా వెటకారం మాటలూ నువ్వూను !

అని యింట్లోకి దూకేసి, కుర్చీలో జారపడికూచుని, ఆయన ఆ ఉత్తరం మళ్ళీ గొణుక్కుని, తొమ్మిదినెల్ల సంగతి బోధ చేసుకుని, మళ్ళీ సత్వరున విషధరం దగ్గర వాలి,

సుభ – ఈ నెల పత్రిక ఇవ్వండి, ప్లోసీ !

వి – చిత్తం (అని లేచి వెళ్ళి పట్టుకొచ్చి యిచ్చాడు.)

పత్రిక విషధరం చేతిలోంచి లాక్కుని సుభద్రతూటాలాగ నిష్క్రమించి, మళ్ళీ వెనకటి కుర్చీమీదే ఆనుకుని కొన్ని పేజీలు ఇట్టే అని, ఒక వ్యాసం తీసి అది తన మీదే అనుకుని, అందులో మరొకపేరు వ్యాసకర్తదే అనుకుని నిర్ఘాంతపోయి, "నామీదనర్రోయ్!" అని ఒక్క రావాణా కేకేసి వెనక్కి ఘూర్ణిల్లి పోయాడు. "చిలకాగోరింకల్లాంటి వాళ్ళకి ఎంతొచ్చిందదండీ ! రామచంద్ర !" అంటూను భార్యగారొచ్చి "ఫరవాలేదులెండి. లేవండి. ఎవరివల్ల అబద్ధంఉంటే వార్నే కొడుతుంది,అకుంక తక్కిన వాళ్ళ మర్యాదలు మాత్రం ఉంచాదనా మీ ఊహ ? చిగురంటా చూడండి" అంది. సుభద్ర, "అరి, లుచ్చా!" అంటూ నిమ్మళంగా లేచి, మా అమ్మని పిలవ్వమ్మా!" అన్నాడు. పిలవకుండానే, సుబామ్మ వచ్చింది. ఆవిణ్ణిచూసి "నాకు నా భార్యకీ చెరో రాక్షసప్పేరూపెట్టి, తను మంచి పేరెట్టుకుని, మమ్మన్ని విషధరం ఏకాశ దమ్మోయ్!" అంటూ సుభద్ర దీర్ఘాలు తీశాడు.

సుబా – అయ్యో ! అయ్యో ! వీడికేం వచ్చిందర్రోయ్ ! (అని యేడ్చి, ఏడుపు ఆపుగుని, చాప పట్రా కోడలా ! (అని, చాప వేసింతర్వాత) చాపమీద కుదిమట్టంగా కూచుని, హైరానాలేకుండా ఏడవరా నాయ్నా!

అన్న తరువాత, అంతా చాపమీద సర్దుకుని గోల మొదలెట్టారు. స్వాములాడు కాఫీ చల్లారపోస్తూనే వున్నాడు.

సుభ – అమ్మా! నీమీద రాసినట్టే

నమ్మోమ్, నువ్వు రాక్షసతల్లివిగా మరీ।

సుబా – నామీదా! ఓరి వీడి మొహం చౌకా!–నేనేం జేశాన్రా ముసిలిపీనుగునీ! వీడి ప్రజ్ఞ తగిలేసిరిగదరా, వీడిప్రజ్ఞ తగలెయ్యా! తనూ, పిల్లలుగలవాడుగదా, ఇంటిగుట్టు తనకెందుకమ్మా, అడిగేవాళ్లు లేకగానీ!

సుభ – (కొంచెం సమాళించుగుని) ఏదో పరీక్ష తగులడ్డాడు కదా: ఉన్న ఊళ్ళో మెతుకుల్లేక, పొట్ట చేతోపట్టుగుని బస్సీకి యెగడివచ్చాడు, లేనివాణ్ణి రక్షించడమే రక్షించడం. శరణాగత రక్షణానికి మనం పేరుపడిఉన్నాం. ఈ వ్యక్తి తలదాచుకుంటానని నా యింట్లో జాగా అడుగుతున్నాడు, గయుడికి మల్లే. పోనీగదా, అనిచెప్పి వీణ్ణి నేను జేరదీస్తినిగదా, చివరికి వీడు నాకీ పంగనామాలు పెడుతున్నాదే! తెగతిని, తిన్న యింటికి వాసాలు లెక్కెట్టి, ఉడగొట్టి పట్టుకుపోయే బాపతు! సంకర జాతి ఛండాలుడు, తల్లీ తోడూలేదు.

స్వా – ఆయన మీ ఇంట్లో ఊరికే టండీ ఉంటా? ఉరికేజేరి ఇదోటా!

సుభ – అబ్బే! అద్దెకీ!

స్వా – అంతేగద! అద్దెకి సున్నాచుడుతుంటాడా ఏమిటి?

సుబా – ఏ మాట కామాటే అనాలి. అద్దెతిన్నగానే యిచ్చేస్తారండి. అయితే మాత్రం, నాకు రాక్షసప్పేరు పెడతాడా? ఇదావీడి మార్యాదా! (అని మళ్ళీ మొదణ్ణించీ రాగాలెడుతుంది.)

స్వా– ఆ రాతమీమీదే అని ఋజువు లేదేటండీ!

సుబామ్మ – నిక్షేపరాయుళ్ళ లాంటి వాళ్ళకి రాక్షస పేర్లు అంటించేసిన తరవాత ఇహనే ముందయ్యా! నువ్వా నాకు మల్లేనే చావ నవ్వు ఘటంలా ఉన్నావ్!

సుభ– ఊరుకోండి,స్వామి! స్పష్టంగా తెలుస్తుంటేనే। ఇలా గోల చెయ్యడం నించి వీధంట పోయేవాళ్ళు లోపలికి వస్తూండడం వల్ల చిన్న తీర్థంగా ఏర్పాటైంది. స్వాములవారు అప్పుడప్పుడు ఊదుకుంటూ కాస్తకాస్తే కాఫీ కతుకుతూ కుర్చీలోనే కూర్చున్నాడు. విషధరం, సంగతి యావత్తూ వింటూ తన వాటాలోనే గదిలో ఉన్నాడు. సుభద్ర లేచి, జనాన్ని ఎల్లానో సాయం చేసుకుని, వీధులోకి వెళ్ళడానికి దారి నిర్మాణంచేసి స్వాముల వారితో,

సుభ– స్వాములవారూ। ఇంకా చూస్తావేం?

స్వా– కళ్ళుండబట్టి నాయ్నా।

సుభ : అదికాదోయ్। నువ్వు కాఫీ స్వాములారవని విషధరం నిన్ను పేపర్లో ఝూడించేశాడు. నువ్వుమాకు మల్లె ఇదవాలి. వాణ్ణి ఏదో కాస్త గదమాయించాలి. ఇలా ఊరికే కాఫీ పీలుస్తూ కూచుంటే ఏమయినట్టూ! నువ్వు బొత్తిగా కంగారు పడుతున్నట్టు లేదే?

స్వా– ఎక్కడో ఓ పంక్తి నీ కన్వయిస్తే, రాసి ఉన్నదంతా నీ మీదే అనుకునినువ్వు ఏడుస్తూ, కడం వాళ్ళనికూడా ఏడవమానా నాయ్నా(అనికాఫీతాగుతాడు)

సుభ–అల్లా అయితే, నేను విషంధర దగ్గరకెళ్ళి వాణ్ణి నాలుగూ అడగాలి. నువ్వు కూడా వస్తావా రావా?

స్వా–కాఫీ తాగనీండి, నాయ్నా, మీరిచ్చిందేగా।

సుభ—అల్లా అయితే, ఏదు !

అని సుభ ద్ర ఒక్కడూ విషధరం దగ్గిరికివెళ్ళి పోతూంటే ఇంటిఎదుట పోగు పడ్డ జనంలో ఇద్దరు కొట్టుగుంటూండడం గమనించి, ఆగిపోయాడు. వాళ్ళిద్దర్లో ఒకడు ఫించను ఇనస్పెక్టరూ, రెండో వాడు ఉద్యోగం చేస్తున్న ఇనస్పెక్టరు.

ఫించనువాడు — ఆరాత నా మీ దే !

కడంవాడు—ఛీ ! నా మీ దే మనోవ ర్తి వాడివ్;—నీలో ఏముంది రాయడానికి !

ఫిం—అందులో తా గు డు విషయం లేదు కనుక, ఆ రాత నా గురించే !

కడం — స్త్రీ వ్యసనం గురించి ఉంది కనక అక్షరాలా నా మీదే ! నీమీద ఎల్లా అవుతుంది, నీ శార్ధం,

పిం — లంచాలమాట ఉంది గనక నామీదే !

కడం — చిల్లర బాకీల సంగతిలేదు గనక నా మీదే !

పిం — అవకతవకగా ఉంది గనక అచ్చంగా నా మీదే !

ఈ దెబ్బలాట చూసేసరికి సుభ ద్ర కొంతవిచారంతగ్గి స్వాములారితో,

సుభ — చూశావా, స్వాములారూ ! నువ్వు ఇంకా దొడ్డిదార్నే ఉన్నావ్ ! వాళ్ళు ఎంతో సూక్ష్మబుద్ధి ప్రయోగించి తమ సంగతి ఎక్కడెక్కడ రాసిఉందో అల్లా కనిపెట్టుకుంటూంటే, నీకామాత్రం బుద్దేలేదే !

స్వా — నోరుకట్టెయ్ నాయ్నా. నోరు కట్టెయ్! నువ్వు ఏం మాట్లాడుతున్నావో నువ్వెరగవ్! (అని కాఫీ తాగుతాడు .

సుభ — (జనం కేసి తిరిగి, అవతలకి నడుస్తూ) పోనీ మీ రంతా పండయ్యా! వాడి దగ్గిరికెళ్ళి ఈ సంగతి కనుక్కుందాం!

అని విషధరం వాటాలోకి నడిచాడు. జనం కూడా అక్కడికి కదిలారు.

సుభ — ఏమయ్యోయ్! విషధరం గారూ! మీకు మా గృహం నచ్చకపోతే ఖాళీ చెయ్యండి. అంతేగాని మావాటా బాగులేదని అక్కడా అక్కడా అనడం ఏం గొప్పనీ! మీరిచ్చే అద్దె డబ్బులకి, నేను ఎక్కడా లేని హంగులు చేస్తూ కూర్చోలేను.

వి — మీ వాటా నాకు నచ్చింది. దీన్ని గు రిం చి యాగీ నేను ఎక్కడా చెయ్యలేదు. నాకు హంగులు అవసరం లేదు.

సుభ — ఏమో; ఉన్న సంగతదీ!

వి—ఏదీ? సమాధానం చెప్పండి! ఇంత మందిని ఎందుకు పిల్చుకొచ్చారు ?

సుభ — నువ్వు నామీద రాతలు రాయ గలవ్, రాక్షసప్పేర్లెట్టి ?

(అని చేతులాడిస్తూ విషధరంమీదికి వెడతాడు.)

వి — నీమీద ఎవరయ్యా రాసింది.

సుభ — నువ్వే! నువ్వెప్పుడు రాసినా ఎవడిమీదో దెబ్బ!

వి — నీ మీద, నే రాశానా ? ఏం గర్వంగావుంది నీ పనీ! నువ్వు మహారాజువనా, గొప్ప లక్షణాలు నీలో ముద్దకట్టిపోయి ఉన్నాయనా, నువ్వు ఆదర్శప్రాయుడవనా, పోనీ, నువ్వేమన్నా రౌండ్ టేబిల్ కాన్ఫరెన్సుకి వెళ్ళివచ్చావనా?

సుభ — ఓ కాఫీహోటల్లో గుండ్రని బల్లదగ్గిర కొంతమంది ఎరగనివాళ్ళతో

చేరి కాఫీ తాగొచ్చాను.

వి – రాసిందంతా నీగురించే ?

సుభ–ఓ

వి–అదంతా నిజమే ?

సుభ–ఓ

వి–అయితే నీకు కోపం ఎందుకూ ?

సుభ–నిజం అంటే అదంతా నిజమూ కాదు కొంత అబద్ధం.

వి–అబద్ధం అయితే అసలు నీకెందుకూ ?

సుభ–ఇంకావాదిస్తావేమిట్రా నాతోటీ, కొంత నిజం, కొంత అబద్ధం గుచ్చెత్తి నా మీదరాసీ ?

ఈ సమయానికి స్వాములారు కాఫీ పూర్తిచేసి వచ్చి.

స్వా – ప్రపంచకపు రీతే అంత, నాయనా, ఆయన్ని ఏం జెయ్యమన్నావ్!

సుభ – నిజం అయితే మాత్రం వీడెవడయ్యా, నా సంగతి రాయడానికీ, నిజమైన సంగతులు బోలెడు మనం కప్పెట్టుగోడం లేదూ ?

స్వా : అవును, నాయనా, నిజం అయినా సరే, అసభ్యం అయితే మాట్టాడ కూడదు, నాకేం అని మాట్లాడితే ఛీ ఛీ ప్రయోగం చేస్తారు. నిజం అయినా సరే రాజకీయ రీత్యా బేశాసనం అయితే మాట్టాడ నియ్యరుట. నాకేం అని మాట్టాడితే లాఠీ ప్రయోగం చేస్తారు.

సుభ – సరే, అహోరించారు గాని మీరువాక్కండి, వాక్కాయిలాగ! ప్రతి సన్యాసి పీనుగూ నా యింట్లో మెయ్యడమూనూ, శత్రు పక్షం వాదించడమూనూ. నాలో బోలెడు మంచి లక్షణాలుఉంటూంటే అవి తీసుగు రాయ గూడదు వీడూ ? నన్నువచ్చి అడిగితే నే చెప్పనూ ?

వి – తమయొక్క మంచి లక్షణాలు తమరి నోటంటగాని జనానికి తెలియడం లేదు. సరే, ఇది మీ మొదటి మంచి లక్షణంగావును.

సుభ – లోట్లుపట్టుగు ఏడుస్తావేంవ్రా కుళ్లు మీద ఈగవాలినట్టూ! పాకీపని చెయ్యడం అనుకున్నావురా రాయడం అంటేనూ!

వి – చిత్తం అంతటి అదృష్టం పడితే జన్మతరించినట్టే అని మహాత్ములు చెప్ప లేదూ ?

సుభ – నన్నేడిపించి నువ్వు నవ్వు కోవడమా నీ ప్రజ్ఞ ?

వి – స్వతస్సిద్ధం, శారీరకం అయిన లోట్లుచూస్తేజాలి. స్వార్జితం, మానసికం అయిన లోట్లు చూస్తే సరదా.

సుభ–ఇహ నామీద రాశావంటే జాగ్రత్త.

వి–నీమీద ఎన్నడూ రాయను మనుష్యులమీద రాస్తాను.

సుభ – అసలు నాకు కోపం వచ్చిందంటే, మనిషినిగాను.

వి–కోపంరానప్పుడూ అంతేలా కనపడుతున్నారు. పోనీ కీర్తి నష్టానికి దావా తెచ్చుగోండి! (అని దగ్గిరికెళ్ళి గట్టిగా అంటాడు).

స్వా–ముందు మాట, కీర్తి ఉన్న తరు

---

రచనలలో మార్పులూ, చేర్పులూ చేసుకునే హక్కు మాకు వున్నది.

వాతేగా నష్టం రావడానికి!

సుభ—ఒరేయి, స్వాములారూ, నువ్వు లేచిపో! నాగడపతొక్కకు!

స్వా—చిత్తం. హా శిష్యా! తత్వం నీలో జీర్ణించిందిగా! సెలవు.

(అని వెళ్ళిపోతాడు.)

సుభ – ఒరేయి! విషం! మీది మీది కొస్తావురా! పొగరుమోతురకం! నన్ను కొట్టబోతావుట్రా! పైగా నన్ను డిఫర్మేషన్ తెచ్చుగోమంటావురా, భడవా! అయితే నా యిల్లు ఖాళీచెయ్యి! తక్షణం! ఈ ఊళ్ళో నీకు ఇల్లు ఎవడిస్తాడో చూస్తాను.

వి – చిత్తం.

విషధరం ఆ యిల్లు ఖాళీచేశాడు. అతడికి ఇంకో యిల్లు ఇప్పించినాయన్ని చూస్తేకూడా సుభద్రకి కోపం లోగడ సుభద్ర విషధరం దగ్గరకూచుని, "మీ దగ్గర చాలా 'పిట్ట్' ఉందండీ!" అని స్తోత్రాలు చేసేవాడు. ఇప్పుడు అతను రాసింది విమర్శించుతూంటాడు సహజం! అతడు ఒకనాడు గ్రంథ విమర్శచేస్తూ (చాలా మూలం తెలియకుండా కసివెళ్ళబుచ్చుకుని తద్వారా ఒక విధమైన ఔన్నత్యం సంపాదించాలని కొందరు విమర్శకులు సంపాదించే పడికట్టు విమర్శకుప్పెలు సుభద్ర కూడా కొన్ని జాగ్రత్త చేశాడు!) ఒక ప్రదర్శన గ్రంథంలో "ప్రాణా, రసం లేందే!" అని తీర్మానించాడు. (విమర్శ ప్రపంచంలో అతని తీర్మానం వినేవాళ్ళు లేరుమరి; ఎన్నింటికని ఇదవం!) మర్నాడు, ఆ గ్రంథం రాసింది విషధరం పేరింపిగాడైన మరొకాయన అనితెలిసి, ఆయన దగ్గిరికివెళ్ళి, అయ్యా! ఆ గ్రంథం మీదే అని లోగడ ఎరగను. వాడిదనుకున్నాను. మీదని తెలిస్తే నేను దాన్ని మెచ్చుకునే ఉందును," అని సెలవిచ్చాడు. సుభద్ర ఇల్లాగా తన ప్రజ్ఞ వాడుతున్నాడు. సుపుత్రుడు రాయదల్చిన సమాధానం తయారకాలేదు. తక్కిన అంతా క్షేమం. స్వాములారు మరోచోట కాఫీ తాగుతూనే ఉన్నాడు.

ఈ ముక్కలు నాలుగూ చదువుకుని ఇది మళ్ళినామీదేనర్రోయ్!" అని ఘూర్జిలే సుభద్రలు గనక ఎవరేనా ఉంటే ఉండవచ్చు వారు లేచిం తరువాత, వారికి నమోన్నమః

పోస్టులో పంపబడిన సంచికలు చేరడంలేదని చాలా మంది రాస్తున్నారు. పోస్టువారి అజాగ్రత్తకు చింతిస్తున్నాము.